

# పండగొచ్చింది

పి.వి. శేషారత్నం

చేతిలో మాసిన గుడ్డ సంచెలో బట్టలు కుక్కుకుని వచ్చిన కూతురు నూకాలుని చూసిన సోములమ్మ మొహం చింకి చేటంతయింది.

ఓలమ్మ ఎంత సిక్కిపోయావే బిడ్డా!'

పదేళ్ల నూకాలు తల్లిని కావిలించుకుంది.

ఆ కౌగిలిలో ఎన్నో భావాలు సుడులు సుడులుగా తిరిగిపోతున్నాయి నూకాలు మనసులో –

అమ్మగారు రోజూ స్కూలునించి వచ్చిన కూతురు పింకీని సరిగ్గా ఇలాగే కావిలించుకుంటారు. అమ్మ ముద్దెట్టుకుంటే బాగుణ్ణు అనుకుంది నూకాలు –

కాని సోములమ్మ అదేం పట్టిచ్చుకోకుండా

'నూకా! మీ అమ్మగారు పండక్కి కొత్త బట్టలు కుట్టిచ్చిందా?'

అమ్మ ముద్దెట్టుకుంటే – పింకీని అమ్మగారు పెట్టుకునే ముద్దు తల్చుకుని తనూ అలాగే మురిసిపోవాలనుకున్న నూకాలికి అసంతృప్తిగా కనిపించింది.

సోములమ్మ నూకాలు తెచ్చిన సంచీలో బట్టల్ని కింద దిమ్మరించింది. అందులో నూకాలుకి అమ్మగారు పండక్కని కుట్టించిన రెండు జతలు ఒక పాత చీర – తువ్వాలు గుడ్డ – రెండు పాత చొక్కాలున్నాయి.

'ఇయ్యేటే'

'అమ్మగారు నీకో పాతసీర – అన్నయ్యకి – సిన్నబాబు సొక్కాలు ఇచ్చారమ్మా'

'బాగానే వున్నాయి' – నూకాలు మొహం చేటంతయింది.

'పోనీమ్మా ఏదో మావయ్య వున్నెమాని మంచిల్లే సూపెట్టాడు నీకు. పని కట్టంగా వుందేటే నూకాలూ?'

'లేదమ్మా' అన్నదేగాని నూకాలు మనస్సులో మాత్రం రోజూ కలిగే అసంతృప్తిని పైకి వెల్లడించలేదు –

రోజూ అమ్మగారింట్లో పొద్దుటే లేచి వాకిలి చిమ్మాలి – అంట గిన్నెలు తోమాలి – ఇంట్లో అందరూ స్నానం చేసి విడిచిన బట్టల్ని ఉతికి ఆరెయ్యాలి – ఈలోగా రాత్రి మిగిలిపోయిన అన్నం పెడతారు అమ్మగారు – కాని వాళ్లు తినే టిఫిన్లకి తనకి నోరూరుతుంది. చిన్నబాబు బూట్లు పాలిష్ చేసి గదులన్నీ తుడిచేసరికి అమ్మగాలికి అయ్యగారికి ఆఫీసు టైమవుతుంది. చిన్నబాబుని అయ్యగారు స్కూలులో దింపుతారు –

పొద్దుటే పాపని మాత్రం తను జాగ్రత్తగా దగ్గర్లో వున్న స్కూలులో దింపుతుంది. బండెడు పుస్తకాలు తనే మోస్తుంది. మళ్లీ మధ్యాహ్నం స్కూలునుంచి తీసుకొస్తుంది. అమ్మగారు మూతపెట్టి వుంచిన అన్నం తింటుంది. పాప పడుకోగానే ఉతికిన బట్టలు తీసి మడతలు పెడుతుంది. అమ్మగారు సాయంత్రంలోగా చెయ్యమన్న చిన్న చిన్న పనులు పూర్తిచేసేసరికి మళ్లీ హడావుడి –

అమ్మగారు ఇంటికొచ్చేక వంటకి తను

> “ఎలా జరిగిందో మరి కొండ మీంచి పెద్దరాయి దొర్లుకుంటూ వచ్చింది. సింహాద్రి తప్పుకునే లోగా కాలుకింద మట్టె జరిగింది. సింహాద్రి నడుం రాయి క్రింద చిక్కుకు పోయింది”.

కూరలు తరిగిపెడ్తుంది – పాపని ఆడిస్తుంది – రాత్రి కంచాలు కడిగి అన్ని పనులూ చక్కబెట్టుకుని మూలనున్న చాపమీదకి చేరే సరికి రాత్రి పది.

పిల్లలు వాళ్ల అమ్మా నాన్నలతో ముచ్చట్లాడుతూ అన్నం తింటూంటే తల్లి అన్నయ్యా తమ్ముడూ గుర్తొస్తారు.

తన గౌను ఎవరో లాగుతున్నట్టనిపించిన నూకాలికి చీమిడి ముక్కుతో తమ్ముడు కన్పించాడు –

'ఓర్నీ చెంచుగా నీ మాటే మర్చిపోయారా?' వాడి నెత్తుకుని ముద్దాడింది నూకాలు – సంచీ అడుగున చిన్న అట్టపెట్టిలోంచి జీళ్లు బయటకి తీసింది –

గుడ్డలో భద్రంగా చుట్టిన గుర్రబొమ్మ తమ్ముడికిచ్చింది.

'అమ్మగార్నడిగి నీ కోసం తెచ్చరా చెంచుగా'

మూడేళ్ల చెంచుగాడి మొహం ఆనందంతో విప్పారింది –

వాడు అపురూపంగా దాన్ని గుండెలకి హత్తుకుని కేరింతలు కొడుతూ వెళ్లిపోయాడు.

సోములమ్మ కొడుకుని కూతుర్ని అపురూపంగా చూసుకుంది. 'దీనికి తమ్ముడంటే ఎంత పేమో'

'అమ్మా అన్నయ్యేడే –'

'అప్పిగాడేనా? వాడి స్నేయితులు మేటవీకి తీస్కుపోయారే నూకాలూ – మరో గంటలో వచ్చేస్తాడ్లే – వట్టి ఎర్రి బాగులాడు – రాంగానే నీ గురించి ఎంతడిగాడో – అమ్మగారు నిన్ను పంపించకపోతే తను పోట్లాడి తీసుకొత్తానన్నాడే అన్నయ్యా –'

'అమ్మగోరు కూడా పిల్లల్తో ఊరెల్లారమ్మా – అందుకే పండక్కి నాకు సెలవిచ్చారు – మళ్లీ కనుం పండగయిపోగానే ఎల్లిపోవాల – పిల్లకి స్కూల్లున్నాయి గదా!'

పదేళ్లయినా లేని కూతురు అంత బాధ్యతగా చెప్తూంటే కళ్లు చెమర్చాయి సోములమ్మకి.

సోములమ్మ మొగుడు సింహాద్రి క్వారీలో పనిచేసేవాడు. ఒకరోజు రాళ్ళు కొడుతుండగా – ఎలా జరిగిందో మరి కొండమీంచి పెద్ద రాయి దొర్లుకుంటూ వచ్చింది. సింహాద్రి తప్పకునేలోగా కాలుకింద మట్టి జరిగింది.

అంతే జారిపడిన సింహాద్రి వడుం రాయి కింద చిక్కుకుపోయింది – కాంట్రాక్టర్ ఏదో వంకపెట్టి తప్పించుకున్నాడు.

ఆరునెలలు తీసుకుని తీసుకుని పుట్టెడు అప్పులు మిగిల్చి ప్రాణం వదిలాడు సింహాద్రి.

ముగ్గురు పిల్లలతో వీధిన పడినట్టయింది సోములమ్మకి – అయిన వాళ్లెవరూ లేరు – ఎక్కడో వేలు విడిచిన తమ్ముడొకడు అక్కగారి పరిస్థితికి జాలిపడి టౌనులో ఒక టీ దుకాణంలో తిండి పెట్టి నెలకింత జీతం ఇచ్చే ఒప్పందం మీద అప్పిగాడిని పనికి కుదిర్చాడు.

నూకాలుని కూడా ఇద్దరు పిల్లలున్న ఓ ఉద్యోగస్థులయిన దంపతుల దగ్గర పనికి కుదిర్చాడు. సోములమ్మ పాచి పని చేసుకుంటుంది.



పండగొచ్చిందంటే కొడుకు కూతురు కోసం ఎదురు చూస్తుంది సోములమ్మ.

క్రితం పండక్కి టీ కొట్టు బిజీగా వుందంటూ అప్పిగాడిని పంపలేదు దుకాణం యజమాని.

ఆ ముందు పండక్కి అమ్మగారు ఊళ్లోనే వుండి నూకాలుకి సెలవు దొరకలేదు. నూకాలు లేకపోతే క్షణం గడవదు అమ్మగారికి.

ఈసారే అంతా కలిశారు.

కొడుకు వస్తూనే తెచ్చిన జనతా చీర చూసి సోములమ్మ ఏడ్చేసింది.

'మా యజమాని కాడ రేషన్ కార్డు అడిగి పండక్కి నీకు సీర తెచ్చానమ్మా!' అన్నాడు అప్పిగాడు.

బిడ్డలకి బట్టలు కుట్టించలేని తన పేదరికాన్ని తిట్టుకుంది సోములమ్మ. తనకే ఎదురు చీరలు తెచ్చిచ్చారు కూతురు కొడుకు. ఏడవాలో నవ్వాలో అర్థం కాలేదు.

రోజూ పాచిపని చేసి అమ్మగారు మిగిలిపోగా ఇచ్చిన పదార్థాలతో తనింత తిని కొడుక్కి పెడుతుంది. పదీ పరకా కూడబెట్టింది కాని చిన్న కొడుక్కి ఆస్మా. ఆ జబ్బుకి ఎంత డబ్బూ చాలడం లేదు.

సంక్రాంతి పండగనాడు కూడా పనికి వెళ్తున్న తల్లిని వద్దని ఏడిచింది నూకాలు.

'అలాగంటే ఎలాగే నూకాలూ పెందలాడే వచ్చేత్తాలే. పండగపూట మానితే అమ్మగారికి కోపం వత్తాదే.'

నూకాలికి ఆ విషయం తెలిసినా ఆ పసి మనసుకి ఏదో చెప్పలేని ఆరాటం. పనిపోతే తల్లికి తిండివుండదు.

త్వరగా వస్తానన్న సోములమ్మ సాయంత్రం ఏడుగంటల దాకా రాలేకపోయింది. అమ్మగారింటికి చుట్టాలొచ్చారంట.

'పిల్లల కెట్టమని అమ్మగారిచ్చారే నూకాలూ ఇదిగో నీకో బొబ్బట్టు – అన్నయ్యకోటి – తమ్ముడికోటి –

ఆనందంగా మూట విప్పి పంచుతున్న తల్లిని చూసి జాలేసింది నూకాలికి.

'అన్నం, కూర, పులుసు కూడా వున్నాయమ్మా గిన్నెలో' సోములమ్మ అంటోంది.

తిరిగి తిరిగి వచ్చిన అప్పిగాడికి ఆకలి మండిపోతున్నా అవేం ముట్టుకోలేదు. నూకాలూ ముట్టలేదు. పసివాడు మాత్రం ఆత్రంగా బొబ్బట్టు నోట్లో కుక్కుకున్నాడు.

'అమ్మా పండగంటే ఏటే?'

నూకాలిని విచిత్రంగా చూసింది సోములమ్మ. 'ఇదో పిచ్చిది'

'ఏముందమ్మా! కుటుంబం అంతా కలిసి...' ఆగిపోయింది సోములమ్మ.

ఆమెకి అర్థమయింది. అంతదూరం నుంచి కొడుకు కూతురు వచ్చారంటే అప్పచ్చుల కోసం కాదు – అవి వాళ్ల యజమానులు మిగిలిపోయినవెలాగూ పెడతారు.

రాత్రి 9 గంటల వేళ వేడిగంజి కాచి ఉల్లిపాయ, ఉప్పు మిరపకాయ చట్నీల్లో వేసిచ్చింది సోములమ్మ. ఆనందంగా తల్లిని వాటేసుకుని ముద్దెట్టుకుంది నూకాలు. అప్పగాడు ఆనందంగా గంజి జుర్రుకుంటున్నాడు. వాళ్ల మొహాలు వెయ్యి కాండిల్స్ బల్బులా వెలిగిపోతుంటే 'ఇదే పండగంటే' అనుకుంది సోములమ్మ.

### కరెక్టు

మీరు బుధవారం వస్తే బాకీ ఇచ్చేస్తావన్నారు. మరి బుధవారం వచ్చాను గదా! ఇవ్వవేమిటయ్యా రామారావ్ అని అడిగాడు కోపంగా హనుమంతరావు

"మీకు వారం కరెక్టుగా చెప్పాముగాని తేదీ, నెల, సంవత్సరం చెప్పలేదుగా అని అన్నాడు.

పి.ఎం. సుందరరావు, విజయవాడ

